క్లుప్తంగా

నేటి నుంచి సీఎం కప్ టోర్నీ

కడ్తాల్: సీఎం కప్–2024 క్రీడా పోటీలు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నామని ఎంపీడీఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈ నెల 12 వరకు (మూడు రోజుల పాటు) మండల స్థాయిలో టోర్నీ కొనసాగుతుందని పేర్కొన్నారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని సూచించారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాసుల పంపిణీ



బస్ పాసులు అందజేస్తున్న దాత

యాచారం: దివ్యాంగులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌పాసులు అందజేశారు. మండల పరిధి గునుగల్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనువాస్‌రెడ్డి తన సొంత నిధులతో 80 మందికి పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. వారి సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని పేర్కొన్నారు. నాయకులు యాదయ్య, మచ్చ లక్ష్మణ్, పూజారి రాకేష్‌కుమార్, మహేశ్, సుధాకర్, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు, ప్రశంసా పత్రాలతో చిన్నారులు

ఆమనగల్లు: అంతర్జాతీయ కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయ్ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అకాడమీకి చెందిన 14 మంది వివిధ విభాగాలలో తలపడ్డారు. ఇందులో ప్రణవి, దీక్షిత, స్రవంతి, పింకి, అరుణ, అస్మిక, ఇందు, పల్లవి, గాయత్రీ, నిహారిక, జస్వికలు బంగారు పతకాలు, వైశాలి, అశ్వన్‌లు సిల్వర్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ సోనూ అభినందించారు.

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోండి

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ మహేందర్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో లయన్ సహకారంతో ఏర్పాటు చేసిన వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం.. నిరుపేదలు, ప్రయాణికుల ఆకలిని తీరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్న కిషన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, రమేశ్, వెంకటేశ్, శ్రీను, బీచ్యానాయక్, కుమార్‌గౌడ్, రాజేందర్‌యాదవ్, గోవర్ధనరెడ్డి, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం బాటసింగారం గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మలక్‌పేటలోని యశోదా ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో హమాలీలు, రైతులు, వర్తకులు, మార్కెట్ సిబ్బంది, పాలకవర్గం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, డైరెక్టర్లు అంజయ్య, రఘుపతి రెడ్డి, గణేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు రూ.1.10 లక్షలు.. మంజూరు రూ.5 వేలు

తుర్కయంజాల్: రాగన్నగూడం రాఘవేంద్ర నగర్ వాసి రాజేందర్ రెడ్డి.. ఆరు నెలల క్రితం గుండెపోటుకు గురై.. వైద్యం చేయించుకున్నాడు. వైద్య ఖర్చులు రూ.1.50 లక్షలు అయింది. ఈ మేరకు రూ.1.10 లక్షల బిల్లులతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.5 వేలు మంజూరు అయినట్లు ఆయనకు సోమవారం చెక్కు అందింది. దీంతో రాజేందర్ మాట్లాడుతూ.. తగిన ఆధారాలతో బిల్లు పెట్టుకుంటే.. కేవలం ఐదు వేలే మంజూరయ్యాయని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, తన అర్జీని మరోసారి పరిశీలించాలని కోరారు.

ప్రమాదపుటంచుల్లో ప్రయాణం

ఒక్కో ఆటోలో 20 నుంచి 30 మంది

- ఆటోవాలాల ఇష్టారాజ్యం.. వ్యవసాయ కూలీలకు ప్రాణసంకటం



సాగర్‌రోడ్డు మాల్ కేంద్రం నుంచి పత్తి తీతకు ఆటోలో వెళ్తున్న మహిళా కూలీలు

యాచారం: పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. స్థానికంగా ఎవరూ పత్తి తీతకు ముందుకు రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రవాణా ఖర్చును భరించి, అధిక కూలీ ధరలు వెచ్చించి ఆటోల్లో కూలీలను పొలాలకు తరలిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ట్రాలీ, ప్యాసింజర్ ఆటో తదితర వాహనాల్లో స్థాయికి మించి మహిళలను తీసుకెళ్తుండటం ఆందోళన కలిగిస్తోంది. డ్రైవర్ ఏ మాత్రం ఏమరు పాటున ఉన్నా, ముందు, వెనకాల వచ్చే వాహన చోదకులు నిర్లక్ష్య డ్రైవింగ్ చేసినా పదుల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

అధికారుల నిర్లక్ష్యం.. కూలీలకు శాపం

ఇష్టానుసారంగా వాహనాల్లో వ్యవసాయ కూలీలను తరలిస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు, రోడ్డు రవాణా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి, అనేక ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. కూలీలు, వారిని తరలిస్తున్న వారు సైతం భద్రత గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. మాడ్గుల, కడ్తాల్, ఆమనగల్లు మండలాలతో పాటు, నల్లగొండ జిల్లా పరిధి మర్రిగూడ, చింతపల్లి, దేవరకొండ మండలాల్లో రైతులు పత్తి పంటను అత్యధికంగా సాగు చేశారు. ఆయా ప్రాంతాల్లో కూలీల కొరత ఉండటంతో.. యాచారం మండలం నుంచి యాచారం, నందివనపర్తి, చౌదర్‌పల్లి, నల్లవెల్లి, చింతపట్ల, కిషన్‌పల్లి, మాల్, కొత్తపల్లి, నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పత్తితీత పనులకు వెళ్తుంటారు.

సాగర్‌రోడ్డుపై పరుగు

పత్తి తీతకు మహిళా కూలీలు ఆటోల్లో సాగర్ రహదారిపై పయనిస్తుంటారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల లోపు సుమారు 50 నుంచి వంద ఆటోల్లో కూలీలను తరలిస్తుంటారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, లైసెన్స్, అనుభవం లేని డ్రైవర్లు ఒక్కో ఆటోలో 20 నుంచి 30 మందిని వ్యవసాయ పనులకు తరలిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసిన ప్యాసింజర్స్‌తో ఆటోవాలాలు దూసుకుపోతుంటారు. వాటితో పాటు ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉన్న హైవేలో ఇలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఆటో, తదితర వాహనాలను పోలీసు, ఆర్టీఏ అధికారులు కట్టడి చేయలేకపోతున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.

కూలీ డబ్బుల ఆశతో..

కూలీ డబ్బుల ఆశతో మహిళా కూలీలు ఇలా ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. నిత్యం రూ.500లతో పాటు ప్రయాణ ఖర్చులు, దావత్‌కు రైతులు డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుత వాతావరణం నేపథ్యంలో అన్నదాతలు పంట నష్టభయంతో అధిక రేట్లు చెల్లించి కూలీలను రప్పించుకుంటున్నారు. అయితే పత్తితీత పనుల్లో గిట్టుబాటు అవుతుందనే ఆశతో.. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అరకొర వాహనాల్లో కూలీలు కిక్కిరిసి ప్రయాణించడం.. ఆందోళనకలిగిస్తోంది. ఏ మాత్రం పట్టుతప్పినా, చోదకుడు ఏమరు పాటున ఉన్నా అందరి ప్రాణాలకు ముప్పుతప్పదని జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

నిఘా ఏర్పాటు చేస్తాం



ఆటోల్లో పరిమితికి మించి మహిళా కూలీలను తరలిస్తున్న డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. కూలీలు కూడా జాగ్రత్తగా ప్రయాణం చేయాలి. మాల్ ప్రధాన కూడలిలో ఉదయం, సాయంత్రం వేళల్లో నిఘా ఏర్పాటు చేస్తాం. డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతాం. ప్రమాదాలు జరిగితే ఆటో డ్రైవర్లదే బాధ్యత. నింబంధనలు ఉల్లంఘిస్తే వాహనం సీజ్ చేస్తాం. డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తాం.

– నర్సింహారావు, సీఐ, యాచారం

పట్టాలు సరే.. ప్లాట్లు ఏవి?

- లబ్ధిదారులకు నివాస స్థలం చూపాలి: బీజేపీ
- జూనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేత



రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తలకొండపల్లి: ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేసిన వారికి.. వెంటనే స్థలాలు చూపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు ప్రసాద్ డిమాండ్ చేశారు. దఫాలుగా పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1998, 99, 2000 సంవత్సరంలో ప్లాట్ల పట్టాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని 6,7 సర్వే నంబర్లలో 1981 నుంచి 2021 వరకు 7 సార్లు, 2023లో మరోసారి పంపిణీ చేశారని తెలిపారు. పత్రాలు అయితే ఇస్తున్నారని కానీ.. లబ్ధిదారులకు నివాస స్థలాలు చూపించడం లేదని వెల్లడించారు. ఇదే విషయమై గతంలో అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వారి గురించి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లబ్ధిదారులకు పక్షం రోజుల్లో స్థలాలు చూపించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనల కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవి గౌడ్, మాజీ సర్పంచ్ కుమార్, రాష్ట్ర నాయకులు పాండు, అసెంబ్లీ కన్వీనర్ అనిల్, యాదయ్య, హరికాంత్, కుమార్, శ్రీను, మహేశ్, శ్రీశైలం, శాంతకుమారి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో మెరుగైన వసతులు

చైర్‌పర్సన్ యాట గీత



ధాన్యం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

ఆమనగల్లు: వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మెరుగైన వసతులు కల్పిస్తామని చైర్ పర్సన్ యాట గీత అన్నారు. సోమవారం ఆమె యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలించారు. రైతులను సమస్యలు అడగగా.. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయని, తడిసిన గింజలను కొనుగోలు చేయాలని ఆమెను కోరారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేశ్వరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు సాయి, శ్రీధర్‌రెడ్డి, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యతోనే భవిష్యత్తు

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న సీఐ కృష్ణంరాజు తదితరులు

యాచారం: పాఠశాల విద్య ఎంతో విలువైనదని, ఉన్నత లక్ష్యంతో చదివితే భవిష్యత్తుకు ఢోకా ఉండదని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. సోమవారం నక్కర్తమేడిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. దాతల సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, బాగా చదువుకోవాలని బాలబాలికలకు చెప్పారు. పాఠశాల విద్యతోనే ఉన్నత చదువుల్లో ఇబ్బంది ఉండదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాలయాలు దేశాభివృద్ధికి సోపానాలు



ఉన్నత పాఠశాలకు డ్యూయల్ డెస్కులు బహూకరించిన దాతలు

తలకొండపల్లి: విద్యాలయాలు దేశాభివృద్ధికి సోపానాలని, తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉంటుందని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర అన్నారు. మండల పరిధి గట్టుఇప్పలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.3 లక్షలు విలువ చేసే 70 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా బాలచంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో మాణిక్యరెడ్డి, హరికిషన్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ శ్రీనివాస గుప్తా, హెచ్‌ఎం వెంకటయ్య, సంస్థ సభ్యులు అమృత్, శరత్‌చంద్ర, మాజీ సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, ఏపీపీసీ చైర్‌పర్సన్ ప్రేమలత, రమాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



కడ్తాల్: పోలీసుల అదుపులో.. మాజీ సర్పంచులు

కడ్తాల్: పెండింగ్ బిల్లుల చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాల నేపథ్యంలో సంఘం ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం చలో అసెంబ్లీకి సిద్ధమైన మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మండల పరిధి మాజీ సర్పంచులు తులసీరాంనాయక్, హరిచంద్‌నాయక్, కృష్ణయ్య యాదవ్, భూనాథ్ నాయక్‌లు ఉన్నారు. సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు(కడ్తాల్ మాజీ సర్పంచ్) లక్ష్మీనర్సింహారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి తరలుతున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అనంతరం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు.

ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సామేల్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి అధికార పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ధర్మాగ్రహ దీక్ష' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల్: పెండింగ్ పీఆర్‌సీతో బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ సత్యనారాయణతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. తపస్ జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత, సంఘం మండల గౌరవ అధ్యక్షుడు భాస్కర్, అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మాధవి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ



శివాలయం మహా పడిపూజలో మాలధారులు, భక్తులు

కడ్తాల్: అయ్యప్ప స్వామి మహా పడిపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక శివాలయంతో పాటు మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలోని ఆలయాల్లో గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ గీత, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉమావతి, అయ్యప్ప భక్తులు మధు, విజయ్‌స్వామి, జగత్‌స్వామి, భీముడు స్వామి నాయకులు వీరయ్య, వెంకటేశ్, హీరాసింగ్, సుమన్, రాజేశ్, రవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు గణితం పరీక్ష



ఆమనగల్లు: టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

ఆమనగల్లు: మండల స్థాయి గణితం పోటీ పరీక్షలను సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కాంపిటేషన్‌కు మండల పరిధి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఆంగ్ల మాధ్యమంలో శ్రీవల్లి, దేవదాసు, నందిని, తెలుగు విభాగంలో పూజ, రోజ, నీలావతిలు విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దూసకంటి శ్రీదర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావ్వ స్వామి, అశోక్‌రెడ్డి, నాగసుందరీ, కనకదుర్గ, సుజాత, వెంకట్‌నారాయణ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయికి

కడ్తాల్: మండల స్థాయి గణితం పోటీ పరీక్షలను మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కాంపిటేషన్‌కు మండల పరిధి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎంలు జంగయ్య, అరుణ, ఉపాధ్యాయ బృందం ప్రశ్న పత్రాలను విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. పరీక్ష అనంతరం ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలో ఆంగ్లం, తెలుగు మాధ్యమం నుంచి ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశామని తెలిపారు. అనంతరం చిన్నారులను అభినందించారు.

తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ



కడ్తాల్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఆమనగల్లు: సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ గీత తదితరులు

- దశాబ్దాల కల నెరవేర్చిన మహనీయురాలు: కాంగ్రెస్ శ్రేణులు
- ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

కడ్తాల్: తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లిగా సోనియా రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి, సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

యాచారంలో..

యాచారం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను హస్తం శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కుమారుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. పీసీసీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనువాస్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం అనంతరం కేక్ కట్ చేశారు. ఇందులో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ గీత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..



తలకొండపల్లిలో..

తలకొండపల్లి: తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చిన మహనీయురాలు సోనియాగాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలు ఆమెకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. సోనియా జన్మదిన వేడుకల సందర్భంగా ఆమె చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి, వృద్ధులు, మహిళలకు పండ్లు పంపిణీ చేశారు.



యాచారంలో.. మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి తదితరులు



మాడ్గులలో..

సంక్షిప్త వార్తలు

◆ యూత్ కాంగ్రెస్ నేతలకు సత్కారం

ఆమనగల్లు: యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్, ఆమనగల్లు మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్‌ను సోమవారం మార్కెట్ చైర్ పర్సన్ గీత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలంలు సన్మానించారు.

◆ టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

తలకొండపల్లి: టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా విష్ణుమూర్తి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, బాలమణి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్, కోశాధికారిగా శ్రీనయ్య, కార్యదర్శులుగా రవి, సాయిబాబా, హరిలాల్, మల్లేశ్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా పరమేష్, వీఓటిటి కన్వీనర్‌గా శ్రీరాములు, సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీజ, మహిళా కమిటీ కన్వీనర్‌గా రేణుక, మండల ఆడిటర్‌గా ప్రభుదాస్, సాంస్కృతిక కమిటీ నిర్వాహకులుగా పరమేశ్వర్, జిల్లా మహాసభ ప్రతినిధులుగా శంకరయ్య, పాండు, రమేష్, వెంకట్ పవార్, బాలమణి, విష్ణుమూర్తి, సంతోష్ కుమార్, రాములయ్యలను నియమించారు.

◆ ప్రభుత్వ పనితీరు భేష్

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన బాగుందని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయత్వంలో ప్రభుత్వం ప్రజలకు చేరువవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని, ఆయనకు మంత్రి పదవీ ఇవ్వాలని కోరారు.

◆ విగ్రహావిష్కరణకు తరలిన మహిళలు



ఇబ్రహీంపట్నం: సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, మండలం నుంచి సోమవారం ప్రత్యేక బస్సుల్లో మహిళలు పెద్దసంఖ్యలో వెళ్లారు. వారితో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉన్నారు.